

ఉచితానికి బొంద..కూటమి దందా

టీడీపీ నేతల దందాలతో ఉచిత ఇసుక కలగానే మిగిలింది. గిద్దలూరు నియోజక వర్గంలో టన్ను రూ.1,200 చొప్పున తెలుగు తమ్ముళ్లు విక్రయిస్తున్నారు. -12లో..



బెట్టింగ్ వ్యసనం.. మోసాలే వీరి లక్ష్యం

బెట్టింగ్‌లకు అలవాటుపడి మోసాలు చేస్తున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.8 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. -12లో..

గరిష్టం/కనిష్టం 31/21

వాతావరణం

పొగమంచు అధికంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు సర్వం సిద్ధం



ముక్కోటి ఏకాదశికి ముస్తాబైన ఐశ్వర్య నగర్లోని భగవాన్ మురళీకృష్ణ మందిరం

ఒంగోలు మెట్రో: ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వివిధ దేవస్థానాల్లో తెల్లవారు జాము నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనానికి ఆయా ఆలయాల నిర్వాహకులు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరి ఝాన్సీరాణి టికెట్లను ముందస్తుగా జారీ చేసి భక్తులకు అందజేశారు. స్థానిక పీవీఆర్ గరల్స్ హైస్కూల్ గడియారం వారి వీధిలో అనంత కోదండ రామస్వామి మందిరం, మంగమూరు రోడ్డు ఐశ్వర్య నగర్ శ్రీ భగవాన్ మురళీకృష్ణ దేవాలయం, కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవస్వామి, కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థానం, సత్యనారాయణపురం దిబ్బల రోడ్డు రైతుబజార్ దగ్గర అనంత కోదండ రామ స్వామి దేవస్థానం, సమతా నగర్లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం, గోపాల్ నగరంలోని మురళీకృష్ణ దేవాలయం, బాపూజీ కాంప్లెక్స్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ఒంగోలు మర్రిచెట్టు కాలనీ పొలిమేర అభయాంజనేయ స్వామి దేవస్థానం, రంగారాయుడు చెరువు దగ్గర శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఆలయ నిర్వాహకులు, అధికారులు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

- అవగాహన పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



కోడిపందేల నిషేధ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తమీమ్ అన్సారియా హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. కోడి పందేలు నిషేధమని అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్లను స్థానిక ప్రకాశం భవనంలో గురువారం కలెక్టర్ ఆవిష్కరించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో చట్ట విరుద్ధంగా కోడి పందేలు జరగకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. గేమింగ్ యాక్టు, జంతు హింస నివారణ చట్టాల మేరకు కోడి పందేలు నిర్వహించడం, పాల్గొనడం కూడా నేరం కిందకే వస్తాయని తెలిపారు. అతిక్రమించిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేలు అరికట్టేందుకు జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, పశుసంవర్ధకశాఖ అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఏపీఎన్జీఓ ఉమెన్ వింగ్ ప్రతినిధులు




సమావేశం నిర్వహిస్తున్న ఏపీఎన్జీఓ ఉమెన్ వింగ్ ప్రతినిధులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీఎన్జీఓ మహిళా వింగ్ కృషి చేస్తోందని జిల్లా మహిళా వింగ్ చైర్‌పర్సన్ కె.కోటేశ్వరమ్మ తెలిపారు. స్థానిక ఎన్జీఓ హోంలో గురువారం ఏపీఎన్జీఓ మహిళా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పని వాతావరణంలో వేధింపులు, మహిళలకు ప్రత్యేక టాయిలెట్స్, రెస్ట్‌రూమ్స్ వంటి సమస్యలపై చర్చించి పరిష్కారం దిశగా కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉమెన్ వింగ్ చైర్మన్ నిర్మలాకుమారి, కన్వీనర్ మాధి, ఆలిండియా గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఉమెన్ కన్వీనర్ రాజ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు, కార్యదర్శి ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డి, శిరీషా, నారాయణమ్మ, రత్నరాణి, శివకుమార్, అంజనాదేవి, ప్రణతి, జయమ్మ, సావిత్రి, శివజ్యోతి, కవిత, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతుకు నష్టాల తెగులు

మిర్చి రైతులను నష్టాల ఘాటు ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. బహిరంగ మార్కెట్లో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. వర్షాలతో మిర్చిని నల్లతామర తెగులు చుట్టుముట్టింది. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా 1,11,646 క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోయింది. వీటికి తోడు రెండు నెలల్లోనే ధరలు ఊహించిన విధంగా పతనమయ్యాయి. దీంతో మిర్చి రైతులు రూ.145 కోట్ల మేర నష్టపోయినట్టు తెలుస్తోంది.

- నల్లతామర తెగులుకు గురైన మిర్చి పంట
- అకాల వర్షాలు తెచ్చిన తంట
- ఎకరాకు రెండు క్వింటాళ్ల మేర తగ్గిన దిగుబడి
- గుంటూరు యార్డులో పతనమవుతున్న ధరలు
- జిల్లాలో మిర్చి రైతులకు రూ.145 కోట్లకుపైగా నష్టం
- 55,823 ఎకరాల్లో సాగు



మార్కాపురం: రెండేళ్లుగా లాభాలు చూసిన మిర్చి రైతులు నేడు నష్టాలు చవిచూస్తున్నారు. జిల్లాలో సుమారు 55,823 ఎకరాల్లో ఎర్రబంగారాన్ని సాగు చేస్తున్నారు. అందులో పశ్చిమ ప్రకాశంలోనే ఎక్కువగా పండిస్తున్నారు. డివిజన్ మొత్తం మీద గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు సబ్‌డివిజన్ల పరిధిలోని 13 మండలాల్లో సుమారు 41,871 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. తూర్పు ప్రకాశంలో కూడా మిర్చి సాగు చేపట్టారు. రైతులు అధిక దిగుబడులిచ్చే రకాలుగా భావిస్తున్న యూఎస్ 341, నంబర్ 5, 5831 తేజలో పలు రకాల మిర్చి వేశారు. ఎకరాకు సుమారు 10 నుంచి 12 వేల మొక్కలు నాటారు. కొంతమంది బోర్ల కింద కూడా మిర్చి సాగు చేశారు. **ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకూ దిగుబడులు రావచ్చని రైతులు భావిస్తున్నారు. ఎకరాకు సుమారుగా 15 నుంచి 18 క్వింటాళ్ల** వరకూ దిగుబడి రావచ్చని అంచనా. **ఇప్పటికే** జిల్లా వ్యాప్తంగా 2 మిర్చి కోతలు పూర్తయ్యాయి. మార్కెట్‌లోకి పచ్చి మిర్చి వచ్చింది.

నల్లతామరతో తగ్గిన దిగుబడి...

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మిర్చిని నల్లతామర తెగులు ఆశించింది. దీనినే వివిధ ప్రాంతాల్లో కుచ్చుతెగులు, వైరస్ తెగులుగా రైతులు భావిస్తున్నారు. రోజురోజుకూ నల్లతామర తెగులు విజృంభిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చుపెట్టినప్పటికీ తెగులు అదుపులోకి రావడంలేదని రైతులు వాపోతున్నారు. నల్లతామర నివారణకు నీలిరంగు **జిగురు అట్టలను పొలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో అక్కడక్కడా పురుగు ఉధృతి తగ్గుతోంది. రైతులు ఎక్కువగా నత్రజని ఎరువులు వాడుతున్నారు.** తెగులు నివారణకు పొటాష్ ఎరువుతో **పాటు** వేపనూనె కూడా వాడాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తెగులు కారణంగా ఎకరాకు సగటున 2 క్వింటాళ్ల దిగుబడి తగ్గిపోయింది. జిల్లాలో సాగవుతున్న 55,823 ఎకరాల్లో ఎకరాకు 2 క్వింటాళ్ల చొప్పున 1,11,646 క్వింటాళ్ల దిగుబడి పడిపోయింది. క్వింటా ధర రూ.13 వేల ప్రకారం జిల్లా వ్యాప్తంగా రూ.145.13 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. ఈ నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉంది.

తగ్గుతున్న ధరలు...

రెండు నెలల కిందట గుంటూరు మిర్చియార్డులో క్వింటా మిర్చి ధర రూ.16 వేల నుంచి రూ.17 వేల మధ్య పలికింది. ధర బాగుందిలే అని రైతులు సంతోషపడగా, ఒకవైపు తెగుళ్లు, మరోవైపు ధర తగ్గడంతో పూర్తిగా నష్టపోతున్నారు. నెలరోజుల నుంచి వైరస్ ఉధృతి ఎక్కువగా ఉంది. గతేడాది మార్చి వరకు గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి అమ్మకాలు బాగా సాగాయి. అప్పట్లో క్వింటాకు రూ.16 వేల నుంచి రూ.18 వేల వరకు ధర లభించింది. ప్రస్తుతం క్వింటా రూ.13 వేలు పలుకుతోంది. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు.



నల్లతామరతో నష్టపోయాం



ఈ ఏడాది సుమారు 4 ఎకరాల్లో మిర్చి వేశా. గత నెలలో ఎర్రనల్లి, ఇప్పుడు నల్లతామర సోకింది. వారానికి సుమారు 10 వేల రూపాయలు తెగుళ్ల నివారణకు ఖర్చుపెడుతున్నా. అయినా అదుపులోకి రావడం లేదు. ఎకరాకు ఎంత లేదన్నా 2 నుంచి 3 క్వింటాళ్ల వరకూ దిగుబడులు తగ్గుతాయి. దీనివలన సుమారు 25 వేల నుంచి 30 వేల రూపాయలు ప్రతి రైతు నష్టపోతున్నారు.

– గుండారెడ్డి లక్ష్మిరెడ్డి, మిర్చి రైతు, వేములకోట

జిల్లాలో సాగు ఇలా...

మండలం	ఖరీఫ్ సాగు (ఎకరాల్లో)
మార్కాపురం	2657.52
దోర్నాల	5817.10
పెద్దారవీడు	4543.83
వైపాలెం	10409.49
త్రిపురాంతకం	5767.35
పుల్లలచెరువు	8098.75
గిద్దలూరు	893.33
రాచర్ల	1086
కొమరోలు	152.31
బేస్తవారిపేట	910.59
కంభం	342.23
అర్ధవీడు	2207.97
తర్లుపాడు	1520.42
దొనకొండ	1386.30
కురిచేడు	2078.14
ముండ్లమూరు	2552.10
దర్శి	1331.42
కొనకనమిట్ల	765.01
పొదిలి	641.69
తాళ్లూరు	259.02
నాగులుప్పలపాడు	510.21
చీమకుర్తి	88.23
మద్దిపాడు	676.82
హనుమంతునిపాడు	57.77
వెలిగండ్ల	186.81
కనిగిరి	471
కొండపి	85.51
సంతనూతలపాడు	134.97
పీసీ పల్లి	186.05

రెవెన్యూ సదస్సుల అర్జీలు పరిష్కరించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



తహసీల్దార్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్:

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఈ నెల 8వ తేదీతో రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో అన్ని మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లతో ఒంగోలులోని కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణ నేపథ్యం, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇస్తున్న ప్రాధాన్యం గురించి వివరించారు. మండల స్థాయి రెవెన్యూ అధికారులు రెవెన్యూ సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మండల సర్వేయర్లతో తహసీల్దార్లు ప్రత్యేకంగా చర్చించి రెవెన్యూ, రెవెన్యూయేతర సమస్యలకు సంబంధించిన అర్జీలను వేరుపరచాలన్నారు. ప్రణాళికలు సిద్ధం చేసుకుని ఆ మేరకు పరిష్కారాలు చేయాలన్నారు. సమస్యల తీవ్రతను బట్టి తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. రెవెన్యూకు సంబంధించి ముఖ్యంగా జాయింట్ ఎల్‌పీఎం, విస్తీర్ణం, సరిహద్దు వివాదాలకు సంబంధించిన అర్జీలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆయా సమస్యలను సహేతుకంగా పరిష్కరించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని సాంకేతిక సమస్యలు ఉంటే వాటిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యల పరిష్కారంలో తీసుకోవాల్సిన అంశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, సర్వే శాఖ ఏడీ గౌస్‌బాషా, డీఆర్‌ఓ చిన ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, డిప్యూటి కలెక్టర్లు కుమార్, సత్యనారాయణ, వరకుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

బీఆర్ నాయుడు నైతిక బాధ్యత వహించాలి

- టీటీడీ చైర్మన్ పదవికి వెంటనే రాజీనామా చేయాలి
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ డిమాండ్



డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి


సింగరాయకొండ: తిరుపతిలోని వైకుంఠ ఏకాదశి దర్శనం టికెట్ల కౌంటర్ వద్ద జరిగిన దుర్ఘటనకు నైతిక బాధ్యత వహించి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందడంతో పాటు 34 మంది తీవ్ర గాయాలపాలయ్యారని, ఇది కేవలం ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో టీటీడీలో రాజకీయ జోక్యం ఎక్కువైందని, పూర్తిగా సమన్వయ లోపం వలన వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కనీస జాగ్రత్తలు తీసుకోవడంలో పూర్తిగా బోర్డు విఫలమైందని విమర్శించారు. బుధవారం జరిగిన దుర్ఘటనే ప్రధాన నిదర్శనమని అన్నారు. కేవలం వీఐపీలు, వీవీఐపీలు, రాజకీయ నాయకుల దర్శనానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి సామాన్య భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించడంలో నిర్లక్ష్యం వహించారనడానికి ఈ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని విమర్శించారు. తిరుపతి చరిత్రలో ఇటువంటి దుర్ఘటన ఎన్నడూ జరగలేదన్నారు.

చంద్రబాబు అనాలోచిత చర్యల కారణంగానే భక్తుల మృతి...

ఈ నెల 8వ తేదీ వరకు చంద్రబాబు కుప్పం పర్యటన కారణంగా పోలీసు యంత్రాంగం మొత్తం కుప్పంలోనే ఉందని, చంద్రబాబు అనాలోచిత చర్యల వలనే తిరుపతిలో దుర్ఘటన జరిగిందని ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. ఇది కేవలం ప్రభుత్వ చేతగానితనమని, కూటమికి సిగ్గుచేటని విమర్శించారు. కానీ, ఇది కేవలం దైవ సంకల్పం అంటూ టీటీడీ చైర్మన్ నాయుడు చేతులు దులుపుకునే ప్రయత్నం ఆయన బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. గత టీడీపీ పాలన 2014–19లో కూడా ఇదేవిధంగా టీటీడీలో వీఐపీలు, వీవీఐపీలకు ప్రాధాన్యత ఇచ్చారని, సీఎం రమేష్, సుజనాచౌదరి లాంటి వారు తమ వెంట 50 నుంచి 100 మంది వరకు నిబంధనలకు వ్యతిరేకంగా తీసుకెళ్లి వైకుంఠ ద్వార దర్శనం చేయించారని సురేష్ గుర్తుచేశారు. ప్రస్తుత దుర్ఘటనలో ఇద్దరుముగ్గురిని సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం చంద్రబాబుకు తగదన్నారు. చనిపోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ దుర్ఘటనపై ఎవరికి వారు విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించి నిజాలను నిగ్గుతేల్చి బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఆదిమూలపు సురేష్ డిమాండ్ చేశారు.

టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



మీడియాతో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని, తిరుపతిలో తొక్కిసలాట ఘటనకు బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటన ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ వైఫల్యమేనని అన్నారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కలియుగ దైవం శ్రీవెంకటేశ్వరస్వామి పాదపద్మాల చెంత తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మరణించడం చాలా బాధాకరమన్నారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎవరి పాపం.. ఎవరికి శాపమంటూ ప్రశ్నించారు..? మృతుల కుటుంబ సభ్యులకు టీటీడీలో ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. తిరుమలలో ఏర్పాట్లలో లోపాలు లేకుండా చూడాలన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వామివారి వైకుంఠ ద్వార దర్శనం కోసం లక్షలాదిగా భక్తులు వస్తారని ముందుగానే అంచనా ఉన్నప్పటికీ టీటీడీ పాలకమండలి, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికారపార్టీ పెద్దలు, ప్రజాప్రతినిధుల సేవలో తరిస్తూ సామాన్య భక్తుల మరణాలకు పరోక్షంగా కారణమైన టీటీడీ పాలకమండలి మొత్తాన్ని రద్దు చేయాలని, చైర్మన్ వెంటనే తప్పుకోవాలని రవిబాబు డిమాండ్ చేశారు. టీటీడీ అధికారులుగానీ, పాలకమండలిగానీ ఉత్తుత్తి ప్రచారానికి ఇస్తున్నంత సమయం ఏర్పాట్ల కోసం ఇవ్వడంలేదని ఆరోపించారు. టోకెన్ల జారీ కేంద్రాలకు సంబంధించిన సమాచారం సరిగా లేదని, భక్తుల భద్రత విషయంలో ఏమరుపాటు తగదని హెచ్చరించారు. మృతుల కుటుంబాలను టీటీడీ పూర్తిగా ఆదుకోవాలన్నారు. అలాగే, రానున్న రోజుల్లో ఏ ఒక్క ప్రాణం పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత టీటీడీ పాలకమండలి, ప్రభుత్వంపై ఉందన్నారు. దీనిలో ఏమాత్రం అలసత్వం తగదన్నారు. వైకుంఠ ద్వారా దర్శనాలు జరిగినన్ని రోజులు మరింత అప్రమత్తంగా ఉంటూ వీఐపీ తాకిడి తగ్గించి సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

నేడే చివరి అవకాశం



పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల ఫిజికల్ పరీక్షలను పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్

- దేహదారుఢ్య పరీక్షలకు గైర్హాజరైన కానిస్టేబుల్ అభ్యర్థులకు మరో అవకాశం
- ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ దామోదర్ సూచన

ఒంగోలు టౌన్: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గతేడాది డిసెంబర్ 30వ తేదీ నుంచి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు నేటితో ముగియనున్నాయి. మొత్తం పది రోజుల పాటు పరీక్షలు జరిగాయి. గురువారం 9వ రోజు 552 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 365 మంది తదుపరి రాత పరీక్షకు ఎంపికయ్యారు. జిల్లాలో మొత్తం 5,345 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరుకావాల్సి ఉంది. వారిలో 4,435 మంది పురుష అభ్యర్థులు, 910 మంది మహిళా అభ్యర్థులు ఉండగా, సగం మందే హాజరయ్యారు. 2,411 మంది పురుష అభ్యర్థులు హాజరవగా, 1,733 మంది క్వాలిఫై అయ్యారు. కేవలం 415 మంది మహిళా అభ్యర్థులు హాజరవగా, 237 మంది క్వాలిఫై అయి తదుపరి రాత పరీక్షకు ఎంపికయ్యారు. మొత్తం మీద 2,826 మంది మాత్రమే దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. మిగిలిన వారు వివిధ కారణాల వలన కాల్ లెటర్‌లో ఇచ్చిన తేదీన హాజరుకాలేకపోయారు. అలాంటి వారికి శుక్రవారం చివరి రోజు అవకాశం కల్పించారు. వారంతా జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండుకు వచ్చి అప్పీల్ చేసుకుని ఈవెంట్స్‌లో పాల్గొనాలని ఎస్పీ దామోదర్ సూచించారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురువారం జరిగిన ఈవెంట్స్‌లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ సురేష్‌బాబు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, పీటీసీ డీఎస్పీలు మాధవరెడ్డి, లక్ష్మణ్‌కుమార్, డీపీఓ ఏఓ రామ్మోహనరావు, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీటీసీ సీఐ షేక్ షమీవుల్లా, పీటీసీ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐలు మనోహర్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి, షేక్ ఖాశీం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా అక్రమ నిర్మాణాలు

పొదిలి: స్థానిక శివాలయం ఎదురుగా ఉన్న సర్వే నంబర్ 853–2లో ఆరామ క్షేత్రం పేరుతో నిర్మించిన అక్రమ కట్టడాలను కోర్టు ఆదేశాలతో అధికారులు గతంలో కూల్చివేశారు. ఏడాది తర్వాత అక్కడ కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా మళ్లీ కట్టణాలు నిర్మిస్తున్నారని అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం కార్యవర్గ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. అధికారులు స్పందించి తక్షణమే నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు యక్కలి శేషగిరిరావు, గొలమారి చెన్నారెడ్డి, పానుగుపాటి కోటేశ్వరరావు, ఆలయ పూజారి మురళీ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వేతనం ఇప్పిస్తా.. విధుల్లో చేరండి



కాంట్రాక్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ

సాక్షి ఎఫెక్ట్..

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడులో సీపీడబ్ల్యూ స్కీమ్ పరిధిలో పని చేస్తున్న 11 మంది కాంట్రాక్ట్ సిబ్బందికి గత 6 నెలలుగా వేతనం ఇవ్వకపోవడంతో 32 గ్రామాలకు తాగునీటి సరఫరాను నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సంఘటనపై '32 ఊళ్లు.. అడుగుతున్నాయ్ నీళ్లు' శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురించిన కథనంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. మూడు రోజులుగా ధర్నా చేస్తున్న సీపీడబ్ల్యూ స్కీమ్ సిబ్బందితో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వేణుగోపాలరావు, ఏఈ జైపాల్ చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వారంలోగా వేతనం ఇపిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా ధర్నాను విరమించాలని కోరగా కాంట్రాక్ట్ సిబ్బంది సమ్మతించారు. గ్రామాలకు శుక్రవారం నీరు సరఫరా చేయనున్నారు.

ఐపీఎస్‌గా క్రైమ్ ఏఎస్పీ శ్రీధర్‌రావు



ఒంగోలు టౌన్: 2008 బ్యాచ్‌కు చెందిన గ్రూప్–1 అధికారి, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావుకు ఐపీఎస్ హోదా ఇస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుత ఎస్పీ ఏఆర్ దామోదర్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో డీఎస్పీ, ఏఎస్పీగా పనిచేశారు. ఎప్పుడో ఐపీఎస్ హోదా దక్కాల్సి ఉంది కానీ ఆయన న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది. ఫలితంగా 2022 నుంచి ఐపీఎస్ హోదా కల్పిస్తూ ఏపీ కేడర్‌కు కేటాయించారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం కూడా నోటిఫై చేసింది. ఐపీఎస్ హోదా సాధించిన ఎస్వీ శ్రీధర్‌బాబుకు ఎస్పీ దామోదర్, పలువురు జిల్లా పోలీసు అధికారులు అభినందనలు తెలిపారు.

స్కూటీని ఢీకొన్న టిప్పర్

- బాలిక మృతి, మరొకరికి గాయాలు

మార్కాపురం: స్కూటీని వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టడంతో ఓ బాలిక మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మార్కాపురం మండలంలోని కుంట–జమ్మనపల్లి గ్రామాల మధ్య గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామం నుంచి సుబ్బులక్ష్మమ్మ తన మనవరాలు రాధ(12)తో కలిసి స్కూటీపై మార్కాపురం వస్తున్నారు. స్కూటీని ఓవర్ టేక్ చేసే క్రమంలో టిప్పర్ ఢీకొనడంతో రాధ మృత్యువాత పడింది. మార్కాపురం రూరల్ ఎస్ఐ అంకమ్మరావు పరిస్థితిని సమీక్షించి, రూరల్ పోలీసులను సంఘటన స్థలానికి పంపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు గ్రానైట్ లారీలు పట్టివేత



బిల్లులు లేకుండా పట్టుబడిన లారీలు

చీమకుర్తి రూరల్: మైనింగ్ బిల్లులు లేకుండా అక్రమంగా గ్రానైట్ ముడిరాళ్లు రవాణా చేస్తున్న లారీలను గనులశాఖ అధికారులు సీజ్ చేశారు. గురువారం రామతీర్థం పరిసర ప్రాంతాల్లో గనుల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 2 లారీలకు బిల్లులు లేకపోవడంతో సీజ్ చేసి ఏపీఎండీసీ కార్యాలయానికి తరలించారు.

ఉచితానికి బొంద కూటమి దందా



హైవేరోడ్డు పక్కన స్టాక్‌యార్డ్‌లో నిల్వ చేసిన ఇసుక

'కూటమి' సర్కారు ఉచిత ఇసుక హామీ ఎప్పుడో అటకెక్కింది. ఇప్పుడంతా పచ్చ నేతల దందానే నడుస్తోంది. ఎమ్మెల్యేల ఆశీస్సులు పుష్కలంగా ఉన్న కొందరు వ్యక్తులు, టీడీపీ, జనసేన సానుభూతిపరులు ఇసుక రీచ్‌ల్లో ఇప్పటికే గద్దల్లా వాలిపోయారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో స్టాక్ యార్డులు ఏర్పాటు చేసి ఇసుక తామే అమ్ముతాం.. అవసరమైన వాళ్లు మా దగ్గరే కొనాలని పరోక్షంగా అల్టిమేటం జారీ చేశారు. కాదూ కూడదని ఎవరైనా రీచ్ నుంచి ఇసుక తీసుకొస్తే క్షణాల్లో పోలీసులను పురమాయించి వాహనాలను సీజ్ చేయిస్తున్నారు. ఉచిత ఇసుక పథకం భవన నిర్మాణదారులకు చుక్కలు చూపిస్తుండగా.. ఈ రంగంపై ఆధారపడిన కార్మికులు సైతం పనుల్లేక కష్టాలు ఎదుర్కొంటున్న పరిస్థితి.

- పేరుకే ఉచితం.. టన్ను రూ.1200 లెక్కన అమ్మకం
- ఉచితం మాటున గిద్దలూరులో దందా మరూ చేసిన టీడీపీ నేతలు
- రాచర్ల మండలం రంగారెడ్డిపల్లెలో స్టాక్ యార్డ్ ఏర్పాటు చేసి దోపిడీ
- రాజకీయ ఒత్తిడితో ఇతరుల ఇసుక లారీలు సీజ్ చేస్తున్న పోలీసులు
- ఇసుక విడిగా అమ్మవద్దని వ్యాపారులకు బెదిరింపులు
- నిర్మాణ పనులు లేక ఇబ్బంది పడుతున్న కార్మికులు

బేస్తవారిపేట:

వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చిన ఇసుక విక్రయం.. నేటి కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన నేతలకు దండిగా ధనం సంపాదించి పెడుతోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉచితంగా ఇసుక ఇస్తామని ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు ప్లేటు ఫిరాయించారు. ఉచిత ఇసుక ఎవరికి ఎంతకావాలో తీసుకుపోండని సీఎం చంద్రబాబు ప్రకటనలిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. తాము లోడింగ్ చార్జీలు మాత్రమే చెల్లించమంటున్నామని టీడీపీ నేతలు తమ దోపిడీకి కొత్త భాష్యం చెబుతున్నారు.



బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన ఇసుక లారీ

యార్డు మనదే.. ఇసుక కొనేయండి!

మార్కాపురం, దర్శి తదితర ప్రాంతాల్లో స్టాక్ యార్డ్ పేరుతో సాగిస్తున్న దందాను గిద్దలూరులో మూడు రోజుల నుంచి అమల్లోకి తెచ్చారు. రాచర్ల మండలంలోని రంగారెడ్డిపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే పక్కన ఇసుక స్టాక్ యార్డ్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే కనుసన్నల్లో ఏర్పాటు చేసిన స్టాక్ యార్డ్‌లో టన్ను ఇసుక రూ.1100–రూ.1200 చొప్పున విక్రయిస్తున్నారు. వినియోగదారుడు 40 టన్నుల ఇసుక కొనుగోలు చేయాలంటే రూ.44 వేలు–రూ.48 వేలు చెల్లించాలి. తరలించే దూరాన్ని బట్టి టన్నుకు రూ.200 బాడుగ అదనంగా చెల్లించాలి. ఈ నేపథ్యంలో కొద్ది మోతాదులో ఇసుకను తెచ్చుకోవాలంటే బాడుగ ఖర్చులు తడిసిమోపడయ్యే పరిస్థితి.

సమావేశం పెట్టి బెదిరింపులు

ఇసుక సరఫరా చేసేందుకు ఎంపిక చేసుకున్న వ్యక్తులు నియోజకవర్గంలో విడిగా ఇసుకను అమ్ముకునే వ్యాపారస్తులకు, లారీ ఓనర్స్‌కు సమావేశం నిర్వహించారు. తమ అనుమతి లేకుండా ఇసుక దింపుకోవద్దని, అనుమతి ఇస్తే తమ మనిషి ఒకరిని పంపుతామని, స్టాక్ ఉన్న వరకు అమ్ముకోండని హుకుం జారీ చేశారు. 'స్టాక్ యార్డ్ వద్ద టన్ను రూ.1100కు కొనుక్కోవాలి, ట్రాన్స్‌పోర్ట్, అన్‌లోడింగ్ మీరే పెట్టుకోవాలి, మీరు ఎంతకైనా అమ్ముకోండి' అని తేల్చిచెప్పారు. తాము నిత్యం పర్యవేక్షిస్తుంటామని, ఎవరైనా తమకు తెలియకుండా ఇసుక తెప్పించుకోవడం, దించుకోవడం చేస్తే కేసులు నమోదవుతాయని బెదిరించారు. 'లారీ ఓనర్లు మొదటి మూడు ట్రిప్పులు మా స్టాక్ పాయింట్‌లో ఉచితంగా ఇసుకను దింపాలి. తర్వాత నుంచి టన్నుకు రూ.850 చెల్లిస్తాం. కాదూకూడదని ఇసుక రవాణా చేస్తే కేసులు పడతాయి' అని హెచ్చరించినట్లు ఓ లారీ యజమాని వాపోయాడు.

నిర్మాణ రంగంలో కుదుపు

ఇసుక సక్రమంగా దొరకకపోవడం, అధిక ధరలు ఉండటంతో భవన నిర్మాణ రంగం కుంటుపడింది. దీంతో జిల్లాలోని 1.5 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులపై ఈ ప్రభావం సుస్పష్టంగా కనపడుతోంది. ఇసుక ధరలు తగ్గుతాయని ఎదురుచూస్తున్న వారి ఆశలు స్టాక్ యార్డ్ మాఫియా రంగంలోకి దిగాక ఆవిరయ్యాయి. కొత్తగా గృహాలు నిర్మించుకునేందుకు ఒకటికి పదిమార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దేగ కళ్లతో కారులో చక్కర్లు..

గత నాలుగైదు రోజులుగా ఇసుక కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తులు నియోజకవర్గంలో కారులో ముమ్మరంగా తిరుగుతున్నారు. ఇసుక అమ్ముకునే వ్యక్తుల వద్దకు వెళ్లి ఇకపై ఆపేయాలని బెదిరించారు. గిద్దలూరు నియోజకవర్గంలో దాదాపు 50 మంది లూజుగా ఇసుకను అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎవరైనా ఇసుక తెప్పించుకుంటే కేసులు పెట్టి లారీలు సీజ్ చేయిస్తామని హెచ్చరించారు. లారీలు ఖాళీగా తిరిగే వచ్చే సమయంలో ఇసుక తెచ్చుకుంటే వాటి యజమానులకు కొంత ఆర్థిక వెసులుబాటు ఉండేది. అయితే కూటమి నేతలు వారిని బెదిరించి ఇసుకను డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. రిటర్న్ లారీల్లో వచ్చిన ఇసుకను అడ్డుకుంటుండటంతో వాటి యజమానులు వాపోతూ సోషల్ మీడియా వేదికగా తమ ఆవేదనను వెళ్లగక్కుతున్నారు. రెండు రోజుల క్రితం బేస్తవారిపేటకు వచ్చిన ఓ లారీని సీజ్ చేయించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇటీవల పొదిలిలోనూ ఓవర్ లోడ్ పేరుతో రూ.50 వేలు జరిమానా విధించి మరుసటి రోజు వదిలేశారు.



నాడు అలా.. నేడు ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో టన్ను ఇసుక రూ.900కే లభ్యం కాగా 40 టన్నులకు రూ.36 వేలు చెల్లించి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే నేరుగా ఇంటికి వచ్చేది. నేడు కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తున్నామంటున్నా.. అదనంగా రూ.20 వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం ఇసుక దందా సాగిస్తున్న కూటమి నాయకులు గిద్దలూరులో టన్ను రూ.1200, మార్కాపురంలో రూ.1280, యర్రగొండపాలెంలో రూ.1500, కనిగిరిలో రూ.1000, దర్శి, పొదిలిలో రూ.1250 ధరకు అమ్ముతున్నారు.

మెడికల్ కాలేజీ నిలిపివేత దుర్మార్గం



మెడికల్ కాలేజీని పరిశీలిస్తున్న ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు

- 'కూటమి' ప్రభుత్వంపై ప్రజా సంఘాల ధ్వజం

మార్కాపురం టౌన్: పశ్చిమ ప్రకాశం ప్రజలకు మెరుగైన వైద్యం కోసం నిర్మిస్తున్న మార్కాపురం మెడికల్ కాలేజీని కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా నిలిపివేసిందని ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీకి సంబంధించిన మూడు బ్లాకుల భవనాలు, విద్యార్థుల వసతి భవనాలు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన వెంటనే పనులు ఆపేశారని, నిర్మాణ పనులు కొనసాగించి ఉంటే ఇప్పటికి 99 శాతం పూర్తయి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం పీపీపీ పేరు చెప్పి కళాశాల పనులు ఆపి పేదలకు వైద్య సాయాన్ని దూరం చేసిందని విమర్శించారు. డాక్టర్ల బదిలీలను నిలిపివేయాలని, తక్షణమే మెడికల్ కాలేజీ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ అందె నాసరయ్య, కోకన్వీనర్ రఫీ, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే అబ్దుల్ రజాక్, సోమయ్య, సుదర్శన్, రెహనాబాను, ఎస్‌రాజు, జి.బాలనాగయ్య, రూబెన్, నాగరాజు, జవ్వాజి రాజు, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు

ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మరణించిన నేపథ్యంలో జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శనం జరిగేలా చూడాలని ఆదేశించారు. భక్తుల ప్రవేశ మార్గం, నిష్క్రమణ మార్గాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, రెవెన్యూ, పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని కోరారు. పోలీసులకు భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జీజీహెచ్‌లో హెచ్ఎంపీవీ వార్డు



ప్రత్యేక వార్డును చూపుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు, పక్కన శ్రీనివాసరావు

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో హెచ్ఎంపీవీ వైరస్ చికిత్స కోసం 14 ఆక్సిజన్ బెడ్లతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రామచంద్రరావు తెలిపారు. జలుబు, దగ్గు, తుమ్ములు, జ్వరం, ఆయాసంతో బాధపడుతున్నవారు వెంటనే వైద్యశాలకు చికిత్స చేయించుకోవాలని సూచించారు. చిన్నపిల్లల్లో ఇలాంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. హెచ్ఎంపీవీ వైరస్ ప్రమాదకరమైనది కాకపోయినా అప్రమత్తంగా ఉండాలని పీడియాట్రిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి తీగ చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

తర్లుపాడు: మండలంలోని కారుమానిపల్లిలో వ్యవసాయ మోటార్లకు ఏర్పాటు చేసిన 2 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టి రాగి తీగ అపహరించారు. అలాగే ఉమ్మారెడ్డిపల్లిలో వాటర్ వర్క్సుకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు ధ్వంసం చేసి రాగివైరును అపహరించారు. విద్యుత్ ఏఈ హనుమానాయక్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు తర్లుపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెట్టింగ్ వ్యసనం.. మోసాలే వీరి లక్ష్యం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

- ఇద్దరు యువకులను అరెస్టు చేసిన పోలీసులు
- రూ.8 లక్షల నగదు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ

నాగులుప్పలపాడు: క్రికెట్ బెట్టింగ్ వ్యసనానికి బానిసలై మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను డీఎస్పీ వెల్లడించారు. బాటప్ల జిల్లా బల్లికురవ మండలం కొప్పరపాలేనికి చెందిన కోట విజయ్ కృష్ణ, పల్నాడు జిల్లా నరసరావు పేట మండలం సాలింనగర్‌కు చెందిన చిక్కాల దొమ్నిక్ చక్రవర్తి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. ఇతరులకు ఫోన్ చేసి ఆర్థిక మోసాలకు పాల్పడటం వీరి నైజం. ఇటీవల నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన శనగల వ్యాపారి కొణిజేటి సురేష్‌కు ఫోన్ చేసి తన మేనల్లుడిలా పరిచయం చేసుకున్నారు. సొంతగా కంపెనీ స్థాపిస్తున్నామని, దానికిగాను రూ.8 లక్షల రూపాయలు అవసరం అని నమ్మబలికి విడతల వారీగా సురేష్ వద్ద రూ.8.34 లక్షలను ఫోన్‌పే చేయించుకున్నారు. సొంత మేనల్లుడిని విచారించగా అలాంటిదేమీ లేదని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన సురేష్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు.. నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. బెట్టింగ్ కోసం గోవా వెళ్లడానికి నిందితులు ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేసి, రూ.8 లక్షల నగదును రికవరీ చేశామని డీఎస్పీ వివరించారు. కేసును ఛేదించిన రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని అభినందించారు.

రద్దీ పేరుతో చార్జీల పెంపు.. ఉపేక్షించేది లేదు

- ప్రయాణికులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు
- ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులకు డీటీసీ సుశీల హెచ్చరిక



మాట్లాడుతున్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుశీల

ఒంగోలు సబర్బన్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని రద్దీ పేరుతో ప్రయాణికుల వద్ద అధికంగా బస్సు చార్జీలు వసూలు చేసే ప్రైవేట్ ట్రావెల్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల హెచ్చరించారు. స్థానిక వెంగముక్కలపాలెం రోడ్డులోని డీటీసీ కార్యాలయంలో ఆమె గురువారం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు, ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులతో సమీక్ష నిర్వహించారు. డీటీసీ మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల యజమానులు జాగ్రత్త వహించాలన్నారు. అధికంగా బస్సు చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. అదేవిధంగా డ్రైవర్లు, క్లీనర్లు ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, బస్సులు, ఇతర వాహనాలకు సంబంధించిన సరైన రికార్డులు వెంట ఉంచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేసి ప్రాసిక్యూషన్‌కు పంపుతామని హెచ్చరించారు. జిల్లాలోని రవాణా సేవలన్నీ వాహన్ సైట్‌లోకి మారినందువల్ల ప్రతి వాహనదారుడు త్రైమాసిక పన్నులు సకాలంలో చెల్లించాలన్నారు. అందుకోసం మొదటగా ప్రతి ఒక్కరూ వాహన్.ఎస్‌బీసీలో ఈ–కేవైసీ, మండల్ మ్యాపింగ్, మొబైల్ అప్‌డేషన్ చేయించుకోవాలని సూచించారు. త్రైమాసిక పన్నుకు సంబంధించిన చివరి తేదీ 2025 జనవరి 31 వరకు వేచి చూడకుండా ఈ నెల 25లోగా వివరాలు అప్‌డేట్ చేయించుకోవాలని చెప్పారు. సమావేశంలో ఎంవీఐలు ఎ.కిరణ్ ప్రభాకర్, కె.రామచంద్రరావు, మోటారు వాహనాల తనిఖీ అధికారులు కె.జయ ప్రకాష్, కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, సుధాకర్, సహాయ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, కాంట్రాక్టు క్యారేజీ బస్సులు, లారీలు, స్కూల్ బస్సులు, మ్యాక్సీ క్యాబుల నిర్వాహకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మత్స్యకారుడు మృతి

కొత్తపట్నం: వేట సాగిస్తున్న క్రమంలో బోటులో జారి పడి గాయాలపాలైన మత్స్యకారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. కొత్తపట్నం మండలం మడనూరు గ్రామం చిన్నపట్టపుపాలేనికి చెందిన వాయల పోలయ్య(54) సముద్రంలో వేటకు వెళ్తూ జవనం సాగిస్తుంటాడు. రోజూమాదిరిగానే ఈ నెల 7న కళాసీలతో వేటకు వెళ్లాడు. వేట సాగిస్తున్న క్రమంలో కాలు జారి బోటులోనే పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో హుటాహుటిన ఒంగోలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందగా ఆయన కుమారుడు వినయ్ కొత్తపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌బాబు తెలిపారు.

మాజీ సర్పంచ్ నుంచి నిధుల రికవరీకి నోటీసులు

సంతనూతలపాడు: మండల కేంద్రమైన సంతనూతలపాడు గ్రామ సర్పంచ్‌గా 2013–18 మధ్య పనిచేసిన టీడీపీ నేత ఆర్.అంకారావుపై ఆయన పదవీ కాలంలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు. అందుకు సంబంధించి రికవరీ యాక్టు 1964 ప్రకారం ఆర్.అంకారావు 30,48,373 రూపాయలను ప్రభుత్వానికి చెల్లించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఈ మేరకు మాజీ సర్పంచ్‌కు గురువారం సంతనూతలపాడు ఈఓఆర్డీ రమణమ్మ నోటీసులు అందజేశారు.

విద్యార్థినులతో వైస్ ప్రిన్సిపాల్ అసభ్య ప్రవర్తన

మద్దిపాడు: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాలలో విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన వైస్ ప్రిన్సిపాల్‌పై మద్దిపాడు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. అందిన వివరాల మేరకు.. కళాశాలకు చెందిన ఓ విద్యార్థినితో ఆయన అసభ్యంగా ప్రవర్తిస్తుండటంతో భరించలేకపోయింది. బాధిత విద్యార్థిని గురువారం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వైస్ ప్రిన్సిపాల్ ఆగడాలను వివరించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.